


# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 16, ఏప్రిల్ 2026


# రహదారి భద్రత అందరి బాధ్యత




✦ ప్రమాదాల నివారణ సమిష్టి కృషితోనే సాధ్యం

✦ విద్యార్థులతో భారీ మానవహారం బైక్ ర్యాలీని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

✦ ఆదిలాబాద్‌లో ఘనంగా రహదారి భద్రత అవగాహన కార్యక్రమం

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

రహదారి నిబంధనలు పాటించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, మన ప్రాణాలను రక్షి ంచే ముఖ్యమైన అంశమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ˇఅరైవ్ అలైవ్ రహదారి భద్రత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలపై సమాజంలో అవగాహన పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. దేశంలో సహజ మరణాల కంటే రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య అధికంగా ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, రహదారుల నిర్మాణం మరియు లోపాల సవరణ, ట్రాఫిక్ నిబంధనల కఠిన అమలు, ప్రమాదాల సమయంలో తక్షణ వైద్యసహాయం అందించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా 25 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ ప్రయాణం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని హెచ్చరించారు. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం ప్రాణాపాయాన్ని తగ్గిస్తుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ యువత వేగాన్ని నియంత్రించుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని అన్నారు. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే పోలీసు, రవాణా శాఖల కృషి ఫలిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు స్టేడియం మైదానంలో పాఠశాల విద్యార్థులతో కలిసి మంత్రి హెల్మెట్ - సేవ్ లైవ్స్ ఆకారంలో భారీ మిగతా 2లో..

## చెన్నూర్ నియోజకవర్గాన్ని

# అభివృద్ధి పథంలో నడిపిస్తాం

మంత్రి గడ్డం వివేకానంద హామీ * మందమర్రిలో అభివృద్ధి పనులపై సమీక్ష

**మందమర్రి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. బుధవారం మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. చంద్రయ్య, మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్లు, సింగరేణి మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణలతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా అనేక పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. మున్సిపల్ పరిధిలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణాన్ని వేగవంతం చేసి పట్టణాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపల్ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించిన మంత్రి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. టాంకామ్ ద్వారా విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ముఖ్యంగా జర్మనీ వంటి దేశాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు ఉన్నాయని వివరించారు. అధునా తన సాంకేతిక కేంద్రాల ద్వారా మిగతా 2లో..



## ప్రవేశ పరీక్షల కోచింగ్‌ను

# సద్వినియోగం చేసుకోండి

⁕ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకోవాలి

⁕ శిక్షణలో అంకితభావంతో సేవలందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

⁕ ఉచిత పాలిసెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ కె.హరిత

⁕ జిల్లా ప్రజా పరిషత్ బాలుర పాఠశాల సందర్శన



**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**


విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డి.ఆర్.సి (డీఆర్‌సి) కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలీసెట్, తెలంగాణ సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ప్రవేశ పరీక్షల కోసం ఉచిత కోచింగ్ శిబిరాన్ని బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిగతా 2లో..

# భారీగా రేషన్ బియ్యం పట్టివేత

*** ముగ్గురిపై కేసులు నమోదు**

**తాండూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**

మండలంలోని కిష్టంపేట లీది కాలనీకి చెందిన మోటం దేవేందర్ అనే వ్యక్తి ఇంట్లో ఉన్న 18 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాని మంగళంవారం రాత్రి పట్టుకున్నట్లు తాండూర్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వం ఇస్తున్న బియ్యాన్ని దేవేందర్ ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, మిగతా 2లో..



# రహదారి భద్రత అందరి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

మానవహారాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు రహదారి భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. అనంతరం యువతకు లెర్నింగ్ లైసెన్సులు, డ్రైవర్లకు ఉచిత కళ్లద్దాలను మంత్రి పంపిణీ చేశారు.తదనంతరం స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించడంతో పాటు స్వయంగా పాల్గొని ఉత్సాహపరిచారు. అంబేద్కర్ చౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కె. హరీంద్ర కుమార్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రవేశ పరీక్షల కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

హరిత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకొని, క్రమశిక్షణతో కృషి చేస్తే ఉన్నత స్థానాలను సాధించవచ్చని సూచించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కోచింగ్ కార్యక్రమంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులు అంకితభావంతో అందిస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు వారు చేస్తున్న కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో ఈ ఉచిత కోచింగ్ శిబిరం కీలక పాత్ర పోషించనుందని అభిప్రాయ పడ్డారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా మాట్లాడుతూ విద్యార్థులు ఈ కోచింగ్ సెంటర్లో శిక్షణను ఉపయోగించుకొని ఉన్నతమైన స్థానాలని అధిగమించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి లలిత మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమము చేపట్టడం అభినందనీయము అని పేర్కొనారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్,మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్ అధికారి దేవాజి , విలీన విద్య కోఆర్డినేటర్ శాంతి కుమార్, విషయం నిపుణులు ధర్మపురి వెంకటేశ్వర్లు ,మహమ్మద్ సాబీర్, దుర్గం మోహన్, మామిడాల తిరుపతయ్య, శ్రీ శైలం, తొటం శ్యాంసుందర్, రవికుమార్, తిరుపతి, త్రివేణి, ప్రధాన ఉపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, చంద్రశేఖర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు శాంతి కుమారి, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర పాఠశాలను జిల్లా విద్యా శాఖ అధికారి లలిత తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఈ పాఠశాలలో మోడల్ పాఠశాల ఏర్పాటుకు గల సాధ్య సాధ్యాలను అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తున్నదని తెలిపారు. ప్రైవేటు ఏజెన్సీల మోసాలకు గురికాకుండా ప్రభుత్వ మార్గదర్శకత్వంలోనే విదేశీ ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని యువతకు సూచించారు. అలాగే అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, సింగరేణి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లోనూ ప్రతిభ చాటడం అభినందనీయం

**- ఆర్.కె 5 గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా**

**నస్పూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికులు తమ విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటడం అభినందనీయమని ఆర్.కె 5 గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా కొనియాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 5 గనిలో విధులు నిర్వహిస్తున్న రిలే ఏ ఉద్యోగులకు బుధవారం ఆయన బహుమతులను అందజేశారు. ఇటీవల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో రిలే ఏ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా టీం సభ్యులు బండ అశోక్, గొట్టె విజయ్, రాజమౌళి, అరుణ్‌లను మేనేజర్ ప్రత్యేకంగా అభినందిస్తూ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కార్మికులు గని లోపల కఠినమైన విధులు నిర్వర్తిస్తూనే, క్రీడల పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావంతో క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వానికి తోడ్పడటమే కాకుండా, పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఎల్లప్పుడూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ రాందాస్, సర్వేయర్ సంపత్, పిట్ కార్యదర్శి నర్సింగ రావు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, సూపర్వైజర్ పిన్నింటి మల్లారెడ్డి, ఇతర అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ - నస్పూర్‌లో "అరైవ్-అలైవ్" బైక్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్, డీసీపీ**

**నస్పూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**




వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, బుధవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి "అరైవ్-అలైవ్" బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని డీసీపీ ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్యలతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించాలని, రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే తీరని ప్రమాదమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో రహదారులపై లైట్లు ఏర్పాటు చేయడం, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు మార్పులు చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించనున్నట్లు తెలిపారు. వాహనం నడిపే సమయంలో అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, డ్రైవింగ్ చేసేటప్పుడు పూర్తి ఏకాగ్రత అవసరమని ఆయన పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి వాహనానికి సంబంధించి ఖచ్చితమైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించి లేదా మొబైల్ ఫోన్ వినియోగిస్తూ వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని కలెక్టర్ హెచ్చరించారు. తనిఖీలలో ఎవరైనా మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లయితే వారి లైసెన్స్‌లను తక్షణమే సస్పెండ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. 18 సంవత్సరాల వయసు నిండని మైనర్లు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అతివేగం ప్రాణాంతకమని పేర్కొంటూ, రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు నిర్ణీత లోడ్ మాత్రమే రవాణా చేయాలని ఆదేశించారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు బ్రీత్ ఎనలైజర్స్, స్పీడ్ గన్స్ వంటి సాంకేతిక పరికరాలను సమకూర్చుతున్నామని కలెక్టర్ వివరించారు. రోడ్డు భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయడం జరుగుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములై నిబంధనలకు లోబడి వాహనాలను నడపాలని కోరారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్నపాటి జాగ్రత్తలే మన ప్రాణాలను కాపాడతాయని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గుడిపేట పోలీస్ బెటాలియన్ అడ్మిన్ వెంకటరాములు, జిల్లా రవాణా అధికారి గోపికృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శెనిగకుంటలో చేపల సొసైటీ ఏర్పాటును నిలిపివేయాలి

**- పంచాయతీ కార్యదర్శికి రైతుల వినతి**

**దండేపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామంలోని శెనిగకుంటలో చేపల సొసైటీ ఏర్పాటును నిలిపివేయాలని కోరుతూ బుధవారం రైతులు గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ కుంట ద్వారా సుమారు 300 ఎకరాల పంట భూములకు సాగునీరు అందుతుందని రైతులు తెలిపారు. చేపల పెంపకం చేపడితే నీటి వినియోగంపై ఆంక్షలు విధిస్తారని, దీనివల్ల వ్యవసాయం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.కడెం కాలువ 33వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా వచ్చే నీటిని శెనిగకుంటలోకి మళ్లించి సాగుకు వినియోగిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. ఇది కేవలం చిన్న కుంట మాత్రమేనని, పెద్ద చెరువు కాదని స్పష్టం చేశారు. నీరు నిల్వ ఉండే ప్రాంతం సర్వే నంబర్ 117, 49 పరిధిలోని పట్టా భూములేనని, ఇది ప్రభుత్వ భూమి కాదని వివరించారు. కొంతమంది వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ చేపల సొసైటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.చేపల పెంపకం సాగితే పంటలకు నీరు వాడకూడదని ఆంక్షలు పెట్టే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందారు. తమ జీవనాధారమైన వ్యవసాయాన్ని కాపాడాలని అధికారులను కోరారు. సొసైటీ ఏర్పాటు ప్రక్రియను తక్షణమే అడ్డుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ముద్దాసాని మౌళి, వేణు, మల్యాల చంద్రమౌళి, కారుకురి చంద్రయ్య, బాల్లయ్య, తిరుపతి, మొగిలి, శంకర్, వెంకటేష్, కొమురయ్య, మల్లేష్ పాల్గొన్నారు.



## రైతులు పండించిన ధాన్యం కాంట అయిన తర్వాత వెంటనే రైతు లెక్క తేల్చాలి

**- ఇంప్లిమెంటేషన్ చేయకపోవడం మిల్లర్లు కటింగ్ చేస్తున్నారని రైతుల ఆవేదన**

**దండేపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



దండేపల్లి మండల కేంద్రంలో వడ్లు హార్వెస్టింగ్ అయితున్న సందర్భంగా రైతుల కు రిసిప్ట్ విషయంలో దండేపల్లి మండలంలోని ఉద్దేశిస్తూ రైతుల తరఫున గాదె శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం రైతులు పండించిన ధాన్యం కాంట అయిన తర్వాత వెంటనే రైతు లెక్క తేల్చేయాలని ఇన్ని బస్తాలని,ఎన్ని క్వింటాళ్లు,ఎన్ని డబ్బులు వస్తాయి రైతుకు,రిసిప్ట్ రూపంలో కొనుగోలు దారులు రైతు సంతకం తీసుకొని రిసిప్ట్ ఇవ్వాలని నిబంధన ఉన్నప్పటికీ, ఎక్కడ ఇంప్లిమెంటేషన్ చేయకపోవడం వలన రైతులంతా తీవ్రంగా నష్టపోతున్నారని తెలియజేయడం జరిగింది. రైతుల పరిస్థితి ఎక్కడిదాకా తీసుకొచ్చిరంటే రైతే లారీ అంటాడు,రైతే మిల్లు అంటడు, కటింగ్ అవుతుంది అని ఆవేదన పడతాడు.కాబట్టి రైతుకు ఎలాంటి సంబంధం లేదని గవర్నమెంట్ గైడెన్స్ లో స్పష్టంగా ఉంది.కానీ కింద స్థాయిల ఇంప్లిమెంటేషన్ లేకపోవడం వల్ల రైతు తీవ్రంగా నష్టపోతున్నారు కాబట్టి,రైతుకు లారీ తోటి గాని,మిల్లు తోటి గాని కాంట అయిన తర్వాత రైతులకు ఆ ధాన్యం విషయంలో గాని ఎలాంటి సంబంధం లేదని ప్రభుత్వమే స్పష్టంగా చెపుతుంది.కాబట్టి దీన్ని తూచా తప్పకుండా దీనికి రైతుల పరిష్కారం, మంచిర్యాల జిల్లా జెసి, జాయింట్ కలెక్టర్ ఇన్చార్జ్ కాబట్టి వారి ఆధ్వర్యంలోనే ఇది కొనసాగుతుంది కాబట్టి ఇంప్లిమెంటేషన్ చేయాలని రైతులు డిమాండ్ చేయడం చేశారు.ఈ కార్యక్రమం దండేపల్లి మండలంలోని వివిధ గ్రామాల రైతులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భారీగా రేషన్ బియ్యం పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువ ధరకు విక్రయించేందుకు ఇంటి వెనుక ఉన్న షెడ్ లో పిడిఎస్ బియ్యాని అక్రమంగా దాచినట్లు ఎస్సై తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు అతని ఇంట్లో సోదాలు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**జైనూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

జైనూర్ మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు భారీగా స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై రవికుమార్ నేతృత్వంలో పోలీసులు బుధవారం స్థానిక కిరాణా దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బాతనే గోపాల్ (గోపాల్ కిరాణా) వద్ద 40 క్వింటాళ్లు, ముత్యాలువార్ రమేష్ (శ్రీ రాజేశ్వర కిరాణా) వద్ద 13 క్వింటాళ్లు, తౌఫీక్ బద్వాని (జనతా కిరాణా) వద్ద 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ ఉండటంతో అది ప్రభుత్వ సరఫరా బియ్యమని పోలీసులు నిర్ధారించారు. వీటితో పాటు జనతా కిరాణా షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 130 కిలోల బెల్లం, 92 కిలోల పటికను కూడా పట్టుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురు వ్యక్తులపై జైనూర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసినా లేదా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ విక్రయాలపై జీరో టాలరెన్స్ విధానం పాటిస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డు దారులు కూడా తమ బియ్యాన్ని ఇతరులకు అమ్ముకూడదని సూచించారు. ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్

## 15 కోట్ల టెండర్ రద్దుపై కలెక్టర్‌కు బీజేపీ వినతి

**నిర్మల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

నిర్మల్ పట్టణ అభివృద్ధికి గతంలో మంజూరైన 15 కోట్ల రూపాయల పనుల టెండర్లను రద్దు చేయాలన్న మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నిర్ణయం అభివృద్ధిని అడ్డుకోవడమేనని విమర్శిస్తూ బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. పాత టెండర్ల ప్రకారమే పనులు కొనసాగించాలని వారు కోరారు. ఈ సందర్భంగా రావుల రాంనాథ్ మాట్లాడుతూ.. ఉనికి కోసమే బీజేపీ ఈ నిరసన తెలుపుతోందని కొందరు కాంగ్రెస్ నాయకులు అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. వరుస ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించిందని, గత ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదని గుర్తుచేశారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీనే జిల్లాలో ఉనికి కోసం పాకులాడుతోందని ఎద్దేవా చేశారు. పట్టణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 15 కోట్ల పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందుకున్న కలెక్టర్ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, కౌన్సిలర్లు శ్రీరామోజు నరేష్, కూన శశాంక్, ముత్యం, ధర్మాజీ ఈశ్వర్, విఠల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

## చిత్తడి నేలల గుర్తింపునకు చర్యలు వేగవంతం చేయాలి: కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

జిల్లాలో చిత్తడి నేలల గుర్తింపు, అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని చిత్తడి నేలలను శాస్త్రీయంగా గుర్తించి, వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వీటి అభివృద్ధి వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండటంతో పాటు పర్యాటక రంగం పుంజుకుంటుందని తెలిపారు. తద్వారా జిల్లాకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జీవవైవిధ్య పరిరక్షణలో చిత్తడి నేలలు కీలక పాత్ర పోషిస్తాయని, నిబంధనల ప్రకారం వెంటనే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

### - సింగరేణి గని కార్మిక సంఘం డిమాండ్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సింగరేణి గణి కార్మిక సంఘం (ఎస్‌జికెఎస్) డిమాండ్ చేసింది. కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం రిజిస్టర్ (విప్లవ) కార్మిక సంఘాల ఐక్య సంఘటన ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని సంఘం నాయకులు స్పష్టం చేశారు. దేశంలో వేగంగా పెరుగుతున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలను అడ్డుకోవడంలో జాతీయ కార్మిక సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా సింగరేణి సంస్థలో ప్రైవేటీకరణ, కాంట్రాక్టు ఉద్యోగాల పెరుగుదల నేపథ్యంలో కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. సింగరేణి పరిరక్షణ విషయంలో జాతీయ సంఘాల నాయకత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం పాటలకు వ్యతిరేకంగా చిన్న, స్థానిక కార్మిక సంఘాలు నిరసనలు చేపడుతుండగా, జాతీయ సంఘాల నాయకులు సరైన స్థాయిలో పోరాటం చేయడం లేదని విమర్శించారు. గతంలో రిజిస్టర్ (విప్లవ) కార్మిక సంఘాలు సమ్మెలు నిర్వహించి కార్మికులకు అనుకూల ఒప్పందాలు సాధించిన చరిత్రను జాతీయ సంఘాల నేతలు మరిచిపోయినట్లు ఉందని వ్యాఖ్యానించారు. కొంతమంది నాయకులు అధికార యంత్రాంగంతో చర్చల పేరుతో కార్మిక ప్రయోజనాలను పక్కన పెట్టారని ఆరోపించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, చట్టాలను తిప్పికొట్టడానికి బలమైన కార్మిక ఉద్యమం అవసరమని వారు స్పష్టం చేశారు. చిన్న పెద్ద అనే తేడాలు లేకుండా అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా, మిలిటెంట్ ధోరణిలో పోరాటాలు నిర్వహించాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా వస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలు, విధాన మార్పులను అడ్డుకోవడంలో జాతీయ కార్మిక సంఘాలు కూడా విఫలమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల వేలం విధానాన్ని బేషరతుగా వ్యతిరేకించాలని, రాష్ట్రంలో బొగ్గు గనుల వేలం ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ అన్వేషించిన బొగ్గు నిక్షేపాలున్న అన్ని బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని కోరారు. ఇది కార్మికుల ఉపాధి భద్రతకు, సంస్థ భవిష్యత్తుకు అత్యంత కీలకమని తెలిపారు. అలాగే, కార్మిక సంఘాలను విభజించి పాలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జాతీయ కార్మిక సంఘాలు ఈ విభజనలకు పరోక్షంగా దోహదపడుతున్నాయని విమర్శించారు. కాబట్టి రిజిస్టర్ (విప్లవ) కార్మిక సంఘాలు ఇకపై భ్రమలకు లోను కాకుండా ఐక్యంగా ముందుకు సాగి, కార్మికుల హక్కుల సాధన కోసం సమిష్టిగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రిజిస్టర్ విప్లవ కార్మిక సంఘాల చరిత్రను కార్మిక వర్గం గమనిస్తూనే ఉందని, భవిష్యత్తులో కూడా ఐక్య పోరాటాల ద్వారానే విజయాలు సాధ్యమని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, బెల్లంపల్లి ఏరియా నాయకులు ఎన్నం శంకర్, జిల్లాల మోహన్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎం.పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

**వేమనపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి పరిశీలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి నీల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులకు రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, తల్లిదండ్రులు హెల్మెట్ ధరించేలా చేయడం పిల్లల బాధ్యత అని గుర్తు చేశారు. అలాగే పాఠశాల విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు ఎస్సై ప్రత్యక్షంగా పాల్గొని హెల్మెట్ ధరించే ప్రాముఖ్యత, సీట్ బెల్ట్ వినియోగం, జీబ్రా క్రాసింగ్ వినియోగం ట్రాఫిక్ సిగ్నల్స్ అర్థం చేసుకోవడం వంటి అంశాలను ప్రొజెక్టర్‌పై చూపించుకుంటూ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి పోలీస్ సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై జగదీశ్వర్ రెడ్డి

## ఘనంగా చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే

**భైంసా, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**



పట్టణంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన బుధవారం చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డేను ఘనంగా నిర్వహించారు. వాసవి స్కూల్ సమీపంలో భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ఆవశ్యకత మరియు ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రోడ్డు భద్రతపై మానవహారం నిర్వహించి, నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా విద్యార్థులు అరైవ్ అలైవ్ ఆకారంలో కూర్చుని ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భైంసా టౌన్ సీఐ, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీడీసీ భైంసా లెక్చరర్ గుంత సుధాకర్‌కు డాక్టరేట్ పట్టా

**భైంసా, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గుంత సుధాకర్ డాక్టరేట్ పట్టా సాధించారు. ఆర్థిక బాధ్యత చట్టం, ఆర్థిక లోటు, ప్రభుత్వ అప్పులపై దాని ప్రభావం ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వ అప్పులపై పరిశోధన చేసి ఆయన సమర్పించిన నివేదికకు తెలంగాణ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. డాక్టర్ యాదగిరి మార్గదర్శకత్వంలో ఆయన ఈ పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రఘునాథ్ మాట్లాడుతూ.. సుధాకర్ పట్టుదల, విద్యా అంకితభావం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ యు. రవి కుమార్ మాట్లాడుతూ.. ఈ ఘనత కళాశాల ప్రతిష్టను పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ భీమరావు, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ ఎం. శంకర్, ఆర్. రాజు, డాక్టర్ ఓంప్రకాశ్, డాక్టర్ కె. సంతోష్ కుమార్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని సుధాకర్‌ను అభినందించారు.



## ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**నిర్మల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**



జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో విద్యా, పోలీస్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,856 మంది విద్యార్థుల కోసం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫర్నిచర్, నిరంతర విద్యుత్ సరఫరా వంటి కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ పొట్లాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడపాలని, తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఈఓ భోజన్న, డీఐఈఓ పరుశురాం, ఏసీజీఈ పరమేశ్వర్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలపై కార్మిక బాట కార్యక్రమం

## - పరిష్కారం లేకపోతే ఆందోళనలకు హెచ్చరిక

**బెల్లంపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మిక బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్మికుల పెండింగ్ సమస్యలు, వారు రోజువారీగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి టిఎన్‌టీయుసి నాయకులు కార్యాలయాన్ని సందర్శించారు. బెల్లంపల్లిలో సింగరేణి ఆధీనంలో ఉన్న 34 వార్డులకు నీటి సరఫరా, క్వార్టర్స్ మరమ్మత్తులు వంటి పనుల కోసం ప్రత్యేకంగా సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేసినప్పటికీ, పలు ప్రాథమిక సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాల క్రితం వేసిన వాటర్ పైప్‌లైన్లు దెబ్బతిని, పలు చోట్ల రంధ్రాలు పడి నీరు వృథాగా పోతున్నదని వారు తెలిపారు. ఈ సమస్యను సంబంధిత జేఈ దృష్టికి తీసుకెళ్లగా, మరమ్మత్తుల కోసం అవసరమైన మెటీరియల్స్, పర్మనెంట్ వెల్డర్ లేమి కారణంగా పనులు నిలిచి పోయాయని ఆయన వెల్లడించినట్లు తెలిపారు. అదేవిధంగా సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా లేవని కార్మికులు వాపోయారు. క్యాంటీన్ సదుపాయం లేకపోవడం, తాగునీటి ఏర్పాట్లు లేకపోవడం వంటి సమస్యలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ, సింగరేణిలో అది అమలు కావడం లేదని ఆరోపించారు. కోల్ ఇండియా సంస్థలో ఫస్ట్ క్యాటగిరీ వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ, సింగరేణిలో మాత్రం తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్లు ఎనిమిది గంటల పని బదులు 12 గంటలు పని చేయించుకుంటూ, సరైన వేతనం చెల్లించడం లేదని కార్మికులు టిఎన్‌టీయుసి నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. డ్రైవర్లు, ఇతర కాంట్రాక్ట్ కార్మికులకు తగిన వేతనాలు, హక్కులు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో బొగ్గు నిక్షేపాలు తగ్గిపోవడంతో ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని టిఎన్‌టీయుసి ప్రధాన కార్యదర్శి పి. మణిరామ్ సింగ్ సూచించారు. సింగరేణిలో గుర్తింపు పొందిన కార్మిక సంఘం కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమవుతోందని, ఈ కారణంగా యాజమాన్యం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు విమర్శించారు. వెంటనే మందమర్రి జీఎం జోక్యం చేసుకుని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం, జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టీయుసి ప్రధాన కార్యదర్శి పి. మణిరామ్ సింగ్, బెల్లంపల్లి ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గజ్జి దుర్గయ్య, ఉపాధ్యక్షులు గైని తిరుపతి, బొల్లు మల్లయ్య, బి. కుమార్, ఎం. రాజయ్య, ఎండి. అన్వర్, ఎస్.ఎస్. పాండే, జి. శ్యామ్, మేకల నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.





## సహారాలో చిక్కుకున్న పొదుపులు..

**- బాధితుల కళ్లలో కన్నీటి కథ**

**- యేండ్లుగా ఎదురుచూపులు.. పెండ్లిళ్లు, విద్య, ఇళ్ల కలలు చిద్రమవుతున్నాయి**

**మందమర్రి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

కష్టార్జితంగా దాచుకున్న పొదుపులు తిరిగి వస్తాయనే ఆశతో ఎదురు చూస్తున్న సహారా బాధితుల జీవితం అనిశ్చితిలో కూరుకుపోయింది. కాలపరిమితి పూర్తై 45 సంవత్సరాలు గడిచినా డబ్బులు రాకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండ్లిళ్లు, పిల్లల విద్య, ఇళ్ల నిర్మాణం కోసం దాచుకున్న డబ్బులు ఇలా చిక్కుకుపోవడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నాయి. కాయా కష్టాలు చేసి దాచుకున్న సొమ్ము ఇలా చిక్కుకపోతే మిగిలేది కన్నీరేనా? అంటూ బాధితులు వేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న మంచిర్యాల జిల్లా మందమర్రి మార్కెట్‌లో ఉన్న సహారా కార్యాలయం ముందు బాధితులు భారీగా ధర్నా చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకుని ˇమా డబ్బులు వెంటనే చెల్లించాలి అంటూ నినాదాలు చేశారు. సహారా ఇండియా సంస్థలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన తమ సొమ్ము గడువు ముగిసినా చెల్లించకపోవడం అన్యాయమని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డబ్బులు చెల్లించకపోతే జిల్లా వ్యాప్తంగా శాంతియుత ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులు స్థానిక సహారా మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. తమ సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. ముఖ్యంగా జిల్లా ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్యతో పాటు సహారా బాధితులు సిహెచ్ సంజీవ్, డి. రాజమౌళి, రామ్ నరేష్ బాబు, సిహెచ్ సంపత్, ఎస్. మధు, దుర్గం మల్లేశ్వరి, భేరి రమాదేవి, దూత లక్ష్మి, పాషా, అబేదా తదితరులు పాల్గొన్నారు. సహారాలో చిక్కుకున్న ఈ పొదుపులు ఎప్పటికి తిరిగి వస్తాయో అన్న ఆందోళనలో వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. వారి ఎదురుచూపులకు ఎప్పుడు ముగింపు దొరుకుతుందో అన్న ప్రశ్న మాత్రం ఇంకా అనుత్తరంగానే ఉంది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**చింతలమానేపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన గోడిసేల రామా గౌడ్ (76) బుధవారం ఆడిపల్లి శివారు అటవీ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హెడ్ కానిస్టేబుల్ పోచయ్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారము.. రామా గౌడ్ పని నిమిత్తం బాబాసాగర్ గ్రామానికి వచ్చి కాగజ్నగర్ వైపు బైక్ పై వెళుతుండగా ఆడిపల్లి అతని ప్రాంతంలో ఎదురుగా వస్తున్న నికాడే శ్రీకాంత్ బైక్ ను అజాగ్రత్తగా వేగంగా, నడిపి రామాగౌడ్ బైక్ ను ఢీ కొన్నాడు. రామాగౌడ్ కింద పడి రక్తపు గాయాలు కాగా చికిత్స కోసం ఆసుపత్రి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు సంతోష్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం

**- జిల్లా సంక్షేమ అధికారి రవుఫ్ ఖాన్**

**తాండూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**

ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారులు పోషకాహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యవంతులుగా ఉంటారని మంచిర్యాల జిల్లా సంక్షేమ అధికారి రవుఫ్ ఖాన్ అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి గ్రామంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణి నుంచి రెండేళ్ల చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నమన్నారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పోషకాహారమే శిశువు ఆరోగ్యం, పెరుగుదలకు ఎంతో కీలకమన్నారు. పోషకాహారంపై ఏమాత్రం నిరక్ష్యం చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల వెంకటేష్, సిడిపిఓ స్వరూప, సూపర్ వైజర్ రమాదేవి, వార్డు మెంబర్ జంబోజుల ప్రవీణ్, అంగన్వాడి టీచర్లు ప్రమీల, రాజేశ్వరి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.





రోడ్డు భద్రతపై గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సర్పంచ్ భూమన్న

## రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

**సారంగాపూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోని ప్రధాన వీధుల వెంబడి ర్యాలీ నిర్వహించి రోడ్డు భద్రత నినాదాలు చేశారు. బస్టాండ్ సమీపంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని సూచించారు. ముఖ్యంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోనేరు భూమన్న, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడే గజేందర్

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

బజార్‌హత్నూర్ మండలంలో బిఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. గ్రామ మాజీ ఉపసర్పంచ్ చట్ల విలాస్, ఆదివాసీ నాయకుడు తులసిరాం బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ ఆడే గజేందర్ వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చట్ల విలాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాటం చేసినా, బిఆర్ఎస్ పార్టీలో కనీస గుర్తింపు, గౌరవం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చులకన భావంతో చూసే పరిస్థితులు ఎదురవ్వడంతో మనస్తాపం చెంది పార్టీని వీడినట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జల్కె పాండురంగ్, మాజీ నెట్‌క్యాప్ డైరెక్టర్ చిలుకూరి భూమన్న, నాయకులు విజేందర్, అరే పాండు, రవి, సందీప్, బద్దం పోతారెడ్డి, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా వి.రాములు బాధ్యతల స్వీకరణ

**నస్పూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా వి.రాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.



ఉపాధి కూలీలకు అంబలి అందిస్తున్న జిల్లా కలెక్టర్: హరిత

## ఉపాధి కూలీలు ఎండ తీవ్రత పట్ల తగుజాగ్రత్తలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**

జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకంలో పని చేసె కూలీలు పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం ఆసిఫాబాద్ మండలంలోని ఎల్లారం గ్రామ పంచాయతి పరిదిలోని కంచర్ గూడా గ్రామములో చేపట్టిన ఉపాది హామీ పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి కలెక్టర్ సందర్శించారు. పని ప్రదేశంలో పనిచేస్తున్న ఉపాది హామీ కూలీలకు అంబలి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాది హామీ పథకంలో పని చేసే కూలీలు ఎండ తీవ్రత పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పనిసరిగా వేడి గాలులు చెవులలో రాకుండా తలకు రుమాలు చుట్టుకోవాలన్నారు. పని ప్రదేశంలో త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనిని త్వరగా పూర్తీ చేసి ఇంటికి చేరుకోవలన్నారు. ఉదయం 10 గంటల నుండి మద్యాహ్నాం 3 గంటల సమయములో బయటకు వెళ్ళకూడదన్నారు. వేడి గాలుల పట్ల రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో ఈజిఎస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## రహదారి నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**



రహదారి నిబంధనలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి వుండాలని కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ లో జిల్లా విద్యా శాఖ ఆద్వర్యంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులతో రహదారి నిబందలపై నిర్వహించిన అవగాహనా సదస్సుకు జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లి దండ్రులకు రహదారి నిబంధనలపై వివరించాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించి ప్రయాణం చేయాలని చెప్పాలన్నారు. విద్యార్థులు పాఠశాల ప్రదేశంలోని రహదారి దాటే సమయంలో ట్రాఫిక్ నిబందనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి పాఠశాలలో రహదారి నిబందనలపై సైన్ బోర్డు వుండేలా చర్యలు తీసుకోవాలని రోడ్డుపై ప్రయాణించినపుడు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘన గాని ప్రేరేపించడం గాని చేయకూడదన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లి దండ్రులకు కడుపు కోత మిగిలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రహదారి నిబందనలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమములో అసిఫాబాద్ ఏఈఓ సుబాష్, రవాణ, విద్యా శాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# 7 గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ - ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనతో మౌలిక వసతుల కల్పన.. అధికారులకు ఆదేశాలు**

**నస్పూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



సర్పంచ్‌లు, అధికారులతో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనపై సమీక్షిస్తున్న కలెక్టర్

మంచిర్యాల జిల్లాలోని ఏడు గ్రామాలను ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పి.ఎం.ఎ.జి.వై.) పథకం కింద ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, సామాజిక సమానత్వం సాధించడమే ఈ పథక ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపిక చేసిన గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పథకం కింద చెన్నూర్ మండలం సుందరశాల, దండేపల్లి మండలం ధర్మారావుపేట, హాజీపూర్, జైపూర్ మండలం రొమ్మిపూర్ గ్రామాలను ఎంపిక చేశారు. కన్నెపల్లి మండలం సాలిగాం, తాండూర్ మండలం చౌటుపల్లి, వేమనపల్లి మండలం బయ్యారం గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. షెడ్యూల్డ్ కులాల జనాభా 40 శాతానికి పైగా ఉండి, కనీసం 500 జనాభా కలిగిన గ్రామాలను ఇందుకు ఎంపిక చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఎస్.సి. ప్రాధాన్య గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, సామాజికఆర్థిక సూచికలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పేదరికం తగ్గించడం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తారు. విద్యార్థులకు వసతులు, విద్యా ప్రవేశాల పెంపు వంటి అంశాలను ప్రణాళికలో చేర్చారు. ఈ పథకం 100 శాతం కేంద్ర నిధులతో అమలు అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదనపు నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. గ్రామాల్లోని లోటుపాట్లను గుర్తించి గ్యాప్ ఫిల్లింగ్ నిధుల ద్వారా మౌలిక అవసరాలను తీరుస్తారు.

గ్రామ స్థాయి కమిటీలు రూపొందించే ప్రణాళికలకు గ్రామ సభ ఆమోదం తప్పనిసరి. ఈ ప్రక్రియను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయి ప్రాజెక్ట్ అప్రైజల్ కమిటీలు ఈ పనులను సమన్వయం చేస్తాయి. అధికారులు, సర్పంచ్‌లు కలిసికట్టుగా పనిచేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జెడ్పీ సీఈఓ గణపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**- హెల్మెట్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు పోటీలు**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, ఎస్ఐ రాజు, ఎస్ఓ సుధాకర్ కలిసి కేజీబీవీ పాఠశాల కాపువాడలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు. విద్యార్థులు కూడా తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థులకు లేఖా రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన

**బెజ్జూర్,ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో ప్రధాన రహదారిపై బుధవారం పోలీసులు రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని తద్వారా ప్రమాద తీవ్రత తగ్గుతుందని ఏఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. రోడ్డు భద్రత రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం ప్రాణానికే ప్రమాదకరమని, వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి పథకం నిరుపేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**

నిరుపేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోవాలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎం పి డి ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో చెక్కులు/ఆర్థిక సాయం అందజేయడం ద్వారా వారి కుటుంబాలకు పెద్ద ఊరటనిస్తోందని, అడపిల్లల పెళ్లిళ్ల సమయంలో తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో మేలు చేస్తోందన్నారు. సమాజంలో బాల్య వివాహాలను నిరోధించడంలో కూడా ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించి 230 మందికి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.



# మరింత మంది సామాజిక కార్యక్రమాల్లో ముందుకు రావాలి: ఎస్సై

**జైనూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత మంది భాగస్వాములు కావాలని జైనూర్ ఎస్సై రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలో జమీయత్ యే ఉలేమా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, వివిధ పనుల నిమిత్తం జైనూర్ పట్టణానికి వచ్చే ప్రయాణికులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సేవా దృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన జమీయత్ యే ఉలేమా ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జమీయత్ యే ఉలేమా జిల్లా ప్రధాన కార్యదర్శి మోలానా మహరాజ్, సంయుక్త కార్యదర్శి హాఫీజ్ మునియర్, సన్ రైస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ షేక్ జమీర్, మాజీ వైస్ ఎంపీపీ షేక్ రషీద్, కాంగ్రెస్ నాయకులు పెందుర్ ప్రకాష్, అజు లాల, షేక్ రహీం, షేక్ షఫీక్, కిరణ్ బుతాలే, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అసద్ అలీ, పలువురు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై రవికుమార్

# భాషా, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది..

## - ఎంపీ గోడం నగేష్

**ఉట్నూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

మాతృ భాష, సంస్కృుతినికాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందనీ ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం ఉట్నూర్ లోని పీఎంఆర్సీలో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గిరిజన అభివృద్ధి, సామాజిక, ఆర్థిక, సాంస్కృుతిక, పర్యావరణ, సుస్థిర అభివృద్ధి కోసం సమగ్ర వ్యూహాలు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీ ప్రతాప్ సింగ్ అధ్యక్షతన జరగా ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ ఎంపీ నగేష్ గోడం, ఉట్నూర్ సర్పంచ్ జాదవ్ అనిత శ్రీనివాస్, మాజీ బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సులను ప్రారంభించారు. ఈ సదస్సు కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ విద్య సంస్థలకు చెందిన ప్రొఫెసర్లు, రీసెర్చ్ అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నేటి ప్రపంచంలో అంత ఆర్టిఫీషియల్ యుగం నడుస్తుందన్నారు. ఈ పోటీకి తగ్గట్టుగా గిరిజన విద్యార్థులకు విద్యతో పాటుగా నూతన ఆవిష్కరణలపై నిర్వహించే సదస్సులో భాగస్వాములు చేయాలన్నారు. గిరిజనులు సామాజిక, ఆర్థిక, సాంస్కృుతిక, పర్యావరణ పరంగా అభివృద్ధి సాధించాలంటే విద్యతోనే సాధ్యం అవుతుందన్నారు. అనంతరం సదస్సులో ఆయా రాష్ట్రా ప్రముఖ విద్యా సంస్థల ప్రొఫెసర్లు రాంబో, మాయాదేవి, ప్రియాంక, విజయ్ కుమార్, అనిల్ కుమార్ లతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ ఆదిలాబాద్, ఇచ్చోడ, నిర్మల్ డాక్టర్ జాదవ్ సంగీత, డాక్టర్ శ్రీనివాస్, సుధాకర్ లు మాట్లాడుతూ విద్యార్థులు మాతృ భాషను మరవకుండా భాష, సంస్కృుతి, సంప్రదాయాలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేటి ప్రపంచంలో అందరి విద్యార్థులలో కొత్త కొత్తబలోచనలతో ముందుకు సాగుతూ వచ్చిన అవకాశాలను అందించుకోవాలన్నారు. అందరిలో సంకల్ప బలం బలంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ప్రకృతిని అర్థం చేసుకునే గుణం ఆదివాసుల్లో ఉంటుందన్నారు. నైతిక విలువలు కాపాడాల్సిన బాధ్యత నేటి తరం పై ఉందన్నారు. మాతృ సంస్కృతిని మరువవద్దని సూచించారు. అనంతరం విద్యార్థుల సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలను చెందిన రీసెర్చ్ అభ్యర్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేష్

# వేడిగాలులపై అప్రమత్తం.. రైతులకు కీలక సూచనలు

**నిర్మల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం మూడు కీలక అంశాలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వరుస సమీక్షలు నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వేడిగాలుల నివారణ, రైతుల మొబైల్ నంబర్ల అప్‌డేషన్, ఇంటర్ ఫలితాలపై ఆమె సుదీర్ఘంగా చర్చించారు. వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లాలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డీ.సెం నుండి 3.5 డీ.సెం వరకు పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. పట్టణాలు, గ్రామాలు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, డీహైడ్రేషన్ మందులు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతుల పట్టాదార్ పాస్‌బుక్‌లతో మొబైల్ నంబర్లను అనుసంధానించే ప్రక్రియను ఏప్రిల్ 20లోగా పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. ఎరువుల బుకింగ్, ప్రభుత్వ రాయితీలు పొందేందుకు ఇది తప్పనిసరి అని పేర్కొన్నారు. రైతులు వెంటనే ఏఈఓలను సంప్రదించి ఓటీపీ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, అధ్యాపకులు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఫలితాలు అందరి సమిష్టి కృషి అని కొనియాడిన కలెక్టర్.. వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉత్తమ ప్రతిభ చూపిన అధ్యాపకులను, విద్యార్థులను త్వరలో జిల్లా స్థాయిలో సన్మానిస్తామని ప్రకటించారు.



జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేసి అభినందనలు తెలుపుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం

# కొండ్ర ఉదయ్‌కు 'దళిత రత్న' పురస్కారం

## హైదరాబాద్‌లో ఘనంగా అవార్డు ప్రదానం... విద్యార్థి ఉద్యమ సేవలకు గుర్తింపు

**నస్పూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

మాదిగ స్టూడెంట్ ఫోరమ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి కొండ్ర ఉదయ్ ప్రతిష్టాత్మక దళిత రత్న పురస్కారాన్ని అందుకున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశాల మేరకు ఉత్సవాల కమిటీ ప్రతినిధులు ఉదయ్‌కు ఈ అవార్డును అందజేశారు. విద్యార్థి ఉద్యమకారునిగా, వర్గీకరణ సాధన కోసం ఉదయ్ చేసిన విశేష సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ రోజరాణి చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, వారి ఉన్నత స్థాయి ఎదుగుదల కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఉదయ్ పేర్కొన్నారు. తన సేవలను గుర్తించి అవార్డు ఇచ్చినందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేశానని, భవిష్యత్తులోనూ వారి హక్కుల సాధన కోసం ముందుంటానని ఉదయ్ స్పష్టం చేశారు. విద్యా రంగంలో సంస్కరణలు, దళిత విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా తన ప్రయాణం కొనసాగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



రవీంద్ర భారతిలో దళిత రత్న అవార్డు అందుకుంటున్న కొండ్ర ఉదయ్

# ఎస్‌సి కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులు ఈనెల 17న పత్రాలతో హాజరుకావాలి

## - ఎంపీడీవో ఉజ్వల్ కుమార్

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**

ఎస్సి కార్పొరేషన్ రుణాల కోసం ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలతో ఈ నెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో హాజరు కావాలని ఎంపీడీవో ఉజ్వల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రుణాల మంజూరు ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ధృవీకరణ పత్రాలు పరిశీలించడం జరుగుతుందని, అభ్యర్థులు తమ దరఖాస్తుకు సంబంధించిన అన్ని అవసరమైన పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హులైన వారికి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్ణయించిన తేదీ, సమయానికి తప్పకుండా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

# పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

## - బెల్లంపల్లి గవర్నమెంట్ పాలిటెక్నిక్ ముందడుగు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్ 2026)కు సిద్ధమవుతున్న విద్యార్థులకు సహాయం చేయడానికి బెల్లంపల్లి గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మే 13న జరగనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.దేవేందర్ తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతులు ఏప్రిల్ 16 నుండి మే 11 వరకు నిర్వహించబడనున్నాయి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ ప్రాథమిక జ్ఞానాన్ని బలోపేతం చేసుకునేందుకు, అలాగే మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఈ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొదటి 100 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించబడుతుందని అధికారులు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 16 లేదా 17 తేదీలలో గవర్నమెంట్ పాలిటెక్నిక్, బెల్లంపల్లి క్యాంపస్ వద్దకు వచ్చి ఈఐ విభాగాధిపతి బి.వెంకటేశ్వర్లు వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పాలిటెక్నిక్ అడ్మిషన్ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్ జనరేషన్, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి వివిధ ప్రాంతాల వారీగా అధికారులను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులు తమ వివరాలు, అవసరమైన ఫీజును సంబంధిత అధికారులకు అందజేస్తే, ఎస్‌బిటిఈటి నిబంధనల ప్రకారం హాల్ టికెట్‌ను సిద్ధం చేసి వాట్సాప్ ద్వారా పంపిస్తారని వివరించారు. ఈ ప్రక్రియకు ఎలాంటి అదనపు రుసుము ఉండదని స్పష్టం చేశారు. ఫీజు వివరాల ప్రకారం ఎస్సీ అండ్ ఎస్టీ అభ్యర్థులకు రూ.250, ఓసి అండ్ బిసి అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించబడిందను అన్నారు. ఈ ఫీజును ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. ఫీజు చెల్లించిన వెంటనే హాల్ టికెట్ వాట్సాప్ ద్వారా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఇంకా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయని విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని, అలాగే ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకులు సాధించాలని ప్రిన్సిపాల్ డా. ఎం.దేవేందర్ ఆకాంక్షించారు.

# శ్రీ శివ మల్లన్న స్వామి దేవాలయ కొత్త ఈవోగా బల్లు రమేష్

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గాం గ్రామంలోని శ్రీ శివ మల్లన్న స్వామి దేవాలయానికి కార్యనిర్వహణాధికారిగా బల్లు రమేష్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ప్రస్తుత కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్త వద్ద నుంచి పూర్తి అదనపు బాధ్యతలతో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ పరిపాలనను మరింత మెరుగుపరచడంపై దృష్టి సారిస్తానని బల్లు రమేష్ తెలిపారు. దేవాలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల పెంపు కోసం చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.





రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కిరణ్ కుమార్

## రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

**హాజీపూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

వాహనదారులందరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని హాజీపూర్ ఎస్సై కిరణ్ కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నిబంధనల పట్ల విద్యార్థులకు బాధ్యతాయుతమైన ప్రవర్తన పెంపొందించేందుకు హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రాణాలతో ఇంటికి చేరుకోవాలి అనే ప్రధాన లక్ష్యంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, డ్రైవర్లు, సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్కూళ్లలో హెల్మెట్ వినియోగం సీట్ బెల్ట్ వినియోగం స్కూల్ పిల్లలు రోడ్డు దాటే విధానం, ట్రాఫిక్ నియమాల పై ప్రాక్టికల్‌గా ఎస్సై దగ్గర ఉండి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. పాఠశాలల్లో రోడ్డు భద్రత ప్రదర్శనలుపాఠశాల విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు ఎస్.ఐ ప్రత్యక్షంగా పాల్గొని హెల్మెట్ ధరించే ప్రాముఖ్యత, సీట్ బెల్ట్ వినియోగం, జీబ్రా క్రాసింగ్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ అర్థం చేసుకోవడం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోటపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో
# అరైవ్-అలైవ్ అవగాహన కార్యక్రమం

### - నాన్నకు ప్రేమతో హెల్మెట్ ధరించమని పిల్లల విజ్ఞప్తి

**కోటపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 13 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం కోటపల్లి కేజీబీవీ పాఠశాలలో ఒక వినూత్న కార్యక్రమం నిర్వహించామనితెలిపారు. అరైవ్ అలైవ్ రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులచే వారి తల్లిదండ్రులకు పోస్ట్ కార్డ్ లేఖలు రాయించామన్నారు. కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఎంతో భావోద్వేగానికి లోనయ్యారని తెలిపారు. ప్రియమైన నాన్నకు... రోడ్డుపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మా భవిష్యత్తు కోసం మీరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి. మా కోసమైనా క్షేమంగా ఇంటికి రండి నాన్నా.. అంటూ రాసిన లేఖలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి. కొందరు విద్యార్థినులు ఒకడుగు ముందుకు వేసి, నాన్న నాకు, అమ్మకు కూడా హెల్మెట్లు తీసుకురండి అని తమ రక్షణ పట్ల ఆరాటాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ పిల్లల మాట అంటే తల్లిదండ్రులకు ఎంతో మక్కువ. వారు కోరితే తండ్రులు తప్పక వింటారు. అందుకే విద్యార్థినుల ద్వారా ఈ ప్రయత్నం చేశాం. ప్రతి తండ్రి బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. అతివేగం మృత్యుపాశమని గుర్తించాలి. కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని కోరడం జరిగింది. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి పోలీస్ సిబ్బంది, కేజీబీవీ పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.



# సెల్‌టవర్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత

సెల్ టవర్ల నిర్మాణాలు వేగవంతం చేసి మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో సమావేశ మందిరంలో బిఎస్ఎన్ఎల్, ఎయిర్టెల్, జియో, టి ఫైబర్ టవర్ల నిర్మాణాలు, స్థల ఎంపికపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టర్ ఏం. డేవిడ్, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డిఓ లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. డిజిటల్ భారత్ నిధి కింద బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో 24 టవర్లు మంజూరయ్యాయని, వీటికి స్థలాల ఎంపికను చేపట్టాలన్నారు, స్థలం ఎంపిక పూర్తయిన వాటిలో టవర్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్, బీఎస్ఎన్ఎల్ అధికారులు జాయింట్ సర్వే పూర్తి చేసి నివేదికలు సమర్పించాలన్నారు. ఎయిర్టెల్, జియో సంస్థల టవర్ల నిర్మాణాలు పూర్తి చేసి మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు అందించాలన్నారు. టీ ఫైబర్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలలో ఇంటర్నెట్ సేవలు అందించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిపిఓ బిక్షపతి, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ జాడి ఉత్తమ్, పిఆర్ ఈఈ ధర్మేందర్, మిషన్ భగీరథ ఈఈ సిద్ధిఖ్, బిఎస్ఎన్ఎల్, ఎయిర్టెల్, జియో, టిఫైబర్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




గాయత్రి పాఠశాలలో రోడ్డు భద్రత అవేర్‌నెస్ కార్యక్రమం



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# పోలీసుల అవగాహన కార్యక్రమం

**చింతలమానేపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

కుమురం భీం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడవ రోజు భాగంగా పిల్లల రోడ్డు భద్రతా దినోత్సవం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి నితికా పంత్ ఆదేశాల మేరకు, కాగజ్‌నగర్ ఉప పోలీసు అధికారి వహీదుద్దీన్ సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ కుమార్, ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మండలం లోని గాయత్రి విద్యాలయంలో విద్యార్థులకు రవాణా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు దాటే సరైన విధానం, తలరక్షక టోపీ వినియోగం, సీటు పట్టీ ధరించడం, పాఠశాల బస్సుల్లో సురక్షితంగా ఎక్కడం, పాఠశాలల సమీపంలో వాహనాల వేగ నియంత్రణ వంటి అంశాలపై వివరంగా తెలియజేశారు. అలాగే మైనర్ డ్రైవింగ్, ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం, పాఠశాల పిల్లలను అధిక సంఖ్యలో వాహనాల్లో తీసుకెళ్లడం, పాఠశాలల వద్ద అధిక వేగంతో వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గాయత్రి పాఠశాలలో రోడ్డు భద్రతపై లేఖా రచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం శివాజీ చౌక్ వద్ద విద్యార్థులు, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలతో కలిసి మానవహారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై సమాజానికి బలమైన సందేశాన్ని అందించారు. ప్రజలకు తలరక్షక టోపీ, సీటు పట్టీ వినియోగం ప్రాణాలను రక్షించగలవని పోలీసు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మైలారం గ్రామ బిఆర్ఎస్ సర్పంచ్ సహా పలువురు కాంగ్రెస్ గూటికి

**బెల్లంపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ సుమలత, గురునాథం ప్రేమ్ సాగర్ గౌడ్, ఉప సర్పంచ్ కొమ్ము హరీష్‌తో పాటు వార్డు సభ్యులు సంధనవేణి లక్ష్మి, రాములు, జంబి విజయ్, బర్ల ప్రేమ్ కుమార్, నాయిని మల్లేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) ఉపాధ్యక్షుడు బొమ్మెన హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో వారిని ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తీసుకెళ్లి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పించి అధికారికంగా పార్టీలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. కొత్తగా పార్టీలో చేరుతున్న నాయకులు పార్టీ బలోపేతానికి కీలకంగా మారతారని, మైలారం గ్రామ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకోవడంతోనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు నాయకులు తెలిపారు. డిసిసి ఉపాధ్యక్షుడు బొమ్మెన హరీష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ముందుంటుందని, గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, బ్లాక్ అధ్యక్షుడు కొమ్ము రాజన్న, జడ భీరయ్య, కొమ్ము తిరుపతి, బత్తిన బాలకృష్ణ, వేల్పుల రాకేష్, సంధనవేణి కిరణ్, జంపం గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.